





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 317 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 06-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# ఫైనల్‌కు టీమిండియా

## భారీ ఛేదనలో పోరాడి ఓడిన ఇంగ్లండ్

- భయపెట్టిన బేథెల్
- సెమీస్ థ్రిల్లర్‌లో భారత్‌దే పైచేయి
- 7 పరుగుల తేడాతో మెరుపు విజయం
- భారత్ 253/7, ఇంగ్లాండ్ 246/7

**ముంబయి:** మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఐసిసి టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు టీమిండియా వరుసగా రెండోసారి ప్రవేశించింది. వెస్టిండీస్, అమెరికా వేదికగా 2024లో జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరి టైటిల్‌ను కొట్టిన భారతజట్టు ముచ్చటగా మూడోసారి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 253పరుగుల భారీస్కోర్ నమోదు చేసినా..


-మిగతా 2 లో





# జనావాసాలపై బాంబుల వర్షం

- 1230 కి చేరిన ఇరాన్ మృతుల సంఖ్య, వేలల్లో క్షతగాత్రులు
- వారసుడి ఎంపిక జరగలేదని ప్రకటించిన ఇరాన్
- భారత్‌కు సరఫరా అయ్యే ఎల్‌ఎన్‌జి 30 శాతం కోత
- మధ్యవర్తిత్వం వహిస్తాం : చైనా



**టెహ్రాన్**
పశ్చిమాసియాలో భారీ దాడులతో యుద్ధం ఆరో రోజూ కొనసాగింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యద్ధోన్మాద దాడులు విస్తృతమయ్యాయి. ఇజ్రాయిల్ దళాలు టెహ్రాన్‌లోని జనావాసాలపై గురువారం వైమానిక దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో ఇరాన్ కమాండ్ సెంటర్లు, మిసైల్ వ్యవస్థలు లక్ష్యంగా చేసుకున్నాయి. ఇరాన్ అంతటా అమెరికా, ఇజ్రాయిల్ దళాల బాంబు దాడులు కొనసాగుతున్నాయి, ముఖ్యంగా సనందాజ్, టెహ్రాన్ ప్రాంతాల్లో భారీ పేలుళ్లు సంభవించాయి. దీనికి ప్రతిగా, ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌లోని టెల్ అవీవ్, మెరాన్ రాడార్ బేస్‌తో సహా పలు లక్ష్యాలపై డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ఇరాన్ సైన్యం ప్రకటించింది. ఈ యుద్ధంతో భారీ ప్రాణనష్టంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు ఈ యుద్ధంలో 1,230 మంది మరణించారు. అమెరికా, ఇజ్రాయిల్ దళాలు ఉద్దేశపూర్వకంగా పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ గురువారం తెలిపింది.


-మిగతా 2 లో


# 99 డేస్ యాక్షన్ ప్లాన్

## ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' పేరుతో జనంలోకి

- నేటి నుంచి పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ కోసం స్పెషల్ డ్రైవ్
- జూన్ రెండో తేదీ వరకు ఒక్కోవారం ఒక్కో రంగంపై ఫోకస్

హైదరాబాద్ మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ఈ నెల ఆరో తేదీ నుంచి జూన్ రెండో తేదీ వరకు ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌తో ప్రజల్లోకి వెళ్లనుంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2023 డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు, 2025 జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు రెండోసారి ప్రజా పాలన గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించిన సంగతి తెలిసిందే.


-మిగతా 2 లో







# కుప్పకూలిన గని..

- కాంగోలో గని కుప్పకూలి 200 మందికి పైగా మృతి
- 70 మంది చిన్నారులు సైతం!
- భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి కుప్పకూలిన రుబాయా కోల్టన్ గని

**క్రిషశ**
ఆఫ్రికా దేశం కాంగోలో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడి రుబాయా కోల్టన్ గని కుప్పకూలింది. ఈ ఘటనలో 200 మందికిపైనే మరణించారు. మృతుల్లో 70 మంది చిన్నారులు ఉన్నట్టు ఆ దేశ గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ గని తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉంది. అయితే, బాంబులతోనే ఈ ప్రమాదం జరిగిందని, కేవలం ఐదుగురు మాత్రమే చనిపోయినట్టు రెబల్ గ్రూప్ ప్రకటించింది. అయితే మంత్రిత్వ శాఖ చెబుతున్న మృతుల సంఖ్య వాస్తవం కాదని ఎం 23 రెబల్స్ సీనియర్ అధికారి ఫానీ కాజ్ తెలిపారు. ఈ మైనింగ్ కూలిపోవడం కాదని, బాంబు దాడుల వల్లే జరిగిందని చెప్పారు. ఐదుగురు మాత్రమే మరణించారని పేర్కొన్నారు. మరోవైపు స్థానిక కార్మికులు మాత్రం 200 కంటే ఎక్కువ మంది చనిపోయారని చెబుతున్నారు. ఆ ప్రదేశంలో 200 కంటే ఎక్కువ మృతదేహాలను వెలికితీసినట్టు గని కార్మికుడిగా పని చేస్తున్న ఇబ్రహీం తాలుసే తెలిపాడు.


-మిగతా 2 లో




## డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధిలో
# ద్వైపాక్షిక బంధం

- ప్రధాని మోడీతో ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ భేటీ

**న్యూఢిల్లీ**
భారత్, ఫిన్లాండ్ తమ ద్వైపాక్షిక సంబంధాలను మలిదశకు తీసుకెళ్లాలని నిర్ణయించాయి. భారత్ పర్యటనలో ఉన్న ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్ గురువారం నాడు ఇక్కడి హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశం అయ్యారు. అనంతరం ఇరువురు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధి రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయనున్నట్లు ఇరువరు నేతలు ప్రకటించారు. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 6జి టెలికాం, క్లీన్ ఎనర్జీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో కలిసి పనిచేయనున్నట్టు తెలిపారు. ఆ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సహకారానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.


-మిగతా 2 లో


# ఇకపై ఫోన్‌లోనే బస్‌పాస్‌లు

- పాస్‌ల కోసం ఇక క్యూ కట్టనక్కర్లేదు..
- గంటల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేదు
- 'మీ టికెట్' యాప్‌లో బస్‌పాస్ సేవలు!

హైదరాబాద్,మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని బస్సు ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్‌పాస్‌ల కోసం లేదా అడ్వాన్స్ టికెట్ బుకింగ్ కోసం బస్‌పాస్ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. ఎక్కడికీ వెళ్లకుండా కేవలం మీ మొబైల్ నుంచే సులువుగా బస్‌పాస్ పొందవచ్చు. దీనికోసం ప్రత్యేకంగా 'మీ టికెట్' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.


-మిగతా 2 లో




# అభివృద్ధి కావాలి.. విధ్వంసం వద్దు

## పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు నడిపితే అడ్డుగా నిలబడతాం



- హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్టు నిరూపిస్తే నేను రాజకీయాలను వదిలేస్తా
- పేదల జోలికొస్తే వారే నీ కుర్చీని మడతపెడతారు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నాగోల్ మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడం సరికాదని, అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టించకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మూసీ అభివృద్ధి విషయంలో ఒక్క ఇల్లు కూడా కూల్చాల్సిన అవసరం లేని విధానం బీఆర్ఎస్ మోడల్ అయితే, లక్షన్నర ఇండ్లను కూల్చే బుల్డోజర్ మోడల్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు "ఇందిరమ్మ రాజ్యం"


-మిగతా 2 లో





# ముగిసిన కడియం విచారణ

- 7వ తేదీకి దానం కేసు వాయిదా
- ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై ..

**-హైదరాబాద్**
ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణలో అనేక విషయాలపై మాట్లాడినట్టు తెలిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ ఇంకా చేపట్టాల్సి ఉంది. తెలంగాణలో ఎమ్మెల్యేల విచారణ కేసు హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. దానం నాగేందర్ విచారణను వచ్చే శనివారానికి స్పీకర్ వాయిదా వేశారు. ఈ కేసులో మార్చి 7వ తేదీ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. ఈ మేరకు నోటీసులిచ్చారు. దీంతో దానం నాగేందర్ పిటిషన్‌ను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చీట్ ఇచ్చిన విషయం విదితమే.


-మిగతా 2 లో

# సర్కార్ సొమ్ముతో రేవంత్ హార్వర్డ్ టూర్

- తెలంగాణలో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ బంద్
- ఇదేనా సీఎం 2021 సెంచరీ లీడర్‌షిప్ విజన్?
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్ చురకలు

హైదరాబాద్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ సొమ్ముతో హార్వర్డ్ టూర్‌కు వెళ్లారని హరీశ్ విమర్శించారు. గురువారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విద్యాశాఖ ద్వారా విడుదలయ్యే నిధులను విద్యార్థుల అభ్యున్నతి కోసం ఖర్చుచేయకపోవడం


-మిగతా 2 లో

# జనావాసాలపై బాంబుల వర్షం

మొదటి తరువాయి

**వారసుడి ఎంపిక జరగలేదు : ఇరాన్**

ప్రస్తుతం, దేశ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ పర్యవేక్షిస్తోంది. ఈ కౌన్సిల్‌లో ఇరాన్ అధ్యక్షుడు, చీఫ్ ఆఫ్ జుడిషియరీ, గార్డియన్ కౌన్సిల్ సభ్యుడు ఉన్నారు. ఖమేనీ వారసుడిని ఎన్నుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఖమేనీ కుమారుడు మోజ్తబా ఖమేనీ ఎంపికయ్యారన్న వార్తలు అవాస్తవమని భారత్‌లోని ఇరాన్ ప్రతినిధి అయతొల్లా అబ్దుల్ మజీద్ హకీమెలాహి స్పష్టం చేశారు.

**ఎల్ఎన్‌జికి కోత..**

హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల భారత్‌కు వచ్చే ద్రవరూప సహజ వాయువు (ఎల్‌పిజి) సరఫరాలో 30 శాతం కోత పడింది. దీని వల్ల గెయిల్ (జిఎఐఎల్) సంస్థ తన వినియోగదారులకు గ్యాస్ సరఫరాను తగ్గించాల్సి వస్తోంది. రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఈ సంక్షోభ సమయంలో భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు రష్యా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మరోసారి పునరుద్ఘాటించారు.

# కుప్పకూలిన గని..

మొదటి తరువాయి

గనుల యజమానులు మరణాల సంఖ్యను వెల్లడించడానికి అంగీకరించడం లేదని చెప్పాడు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా, ఎలాంటి నియంత్రణ లేకుండా ప్రజలు ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చేతులతో తవ్వుతున్నారని స్థానికులు అంటున్నారు. అందుకే ఈ ఘటనలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

# డిజిటలైజేషన్, సుస్థిరాభివృద్ధిలో ద్వైపాక్షిక బంధం

మొదటి తరువాయి



**చర్చలు, రాజనీతితోనే పరిష్కారం : మోడీ**


ప్రీస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని, చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతి మర్గాలే శాశ్వత పరిష్కారాలు చూపగలవని భారత్, ఫిన్లాండ్ విశ్వసిస్తున్నాయని మోడీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

భద్రతామండలిలో భారత్ స్థానం అత్యవసరం : స్టబ్

ఫిన్లాండ్ అధ్యక్షులు అలెగ్జాండర్ స్టబ్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యవస్థ మార్పు దశలో ఉందని, గ్లోబల్ సౌత్ దేశాలు భవిష్యత్ దిశను నిర్ణయిస్తాయని తెలిపారు. భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలంటూ బహిరంగ మద్దతు ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు స్థానం అత్యంత అవసరమన్నారు. శాశ్వత శాంతి ఐక్యరాజ్యసమితి సూత్రాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు.

# సర్కార్ సొమ్ముతో రేవంత్ హార్వర్డ్ టూర్

మొదటి తరువాయి



శోచనీయమని వాపోయారు. తెలంగాణలో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ బంద్ పెట్టడంతో వారు ఆకలితో అలమటిస్తుంటే ముఖ్యమంత్రి మాత్రం విదేశాల్లో లీడర్‌షిప్ సమ్మిట్‌కు హాజరుకావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 'ఇదేనా సీఎం రేవంత్‌రెడ్డి 2021 లీడర్‌షిప్?' అంటూ చురకలంటించారు.

# ముగిసిన కడియం విచారణ

మొదటి తరువాయి



ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయితే, ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసినట్టవుతుంది.

# ఫైనల్‌కు టీమిండియా

మొదటి తరువాయి

టీమిండియాకు ఆషామాషీగా ఏం విజయం దక్కలేదు. ఇంగ్లండ్ ఓపెనర్ బేథెల్(105; 48బంతుల్లో 8ఫోర్లు, 7సిక్సర్లు) చివరి వరకు పోరాడుతూనే ఉన్నాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. బేథెల్ పోరాటం ఆగలేదు. ఇంగ్లండ్ విజయానికి చివరి ఓవర్లో 30పరుగులు కావల్సిన దశలో బేథెల్ రనౌటవ్వడం, ఆ తర్వాత బంతికి ఒక్క పరుగే రావడంతో టీమిండియాకు విజయం ఖాయమైంది. కాని చివరి 3బంతులను జోఫ్రా ఆర్చర్ సిక్సర్లు కొట్టినా.. అప్పటికే టీమిండియాకు గెలుపు లాంచనమే అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ నిర్ణయం బెడిసి కొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ(9) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మరోసారి అదరగొట్టాడు. నిర్ణయాత్మక సూపర్-8 మ్యాచ్‌లో విండీస్‌పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను సెమీస్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించిన సంజు.. ఇంగ్లండ్ బౌలర్లకూ చుక్కలు చూపించాడు. కేవలం 42బంతుల్లోనే 8ఫోర్లు, 7భారీ సిక్సర్లతో 89పరుగులు చేసి టీమిండియా భారీస్కోర్‌కు దోహదపడ్డాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (39: 18బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు)తో కలిసి శాంసన్ స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 97 పరుగులు జోడించారు. శివమ్ దూబే 25 బంతుల్లో 4 సిక్సర్లతో 43 పరుగులు చేయగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. చివర్లో హార్దిక్ పాండ్యా, యువ సంచలనం తిలక్ వర్మ విధ్వంసం సృష్టించారు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేయగా, తిలక్ వర్మ కేవలం 7 బంతుల్లోనే 3 భారీ సిక్సర్లతో సహా 21 పరుగులతో రాణించాడు. జోఫ్రా ఆర్చర్‌కి తోడు విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి ఏకంగా 253 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.

ఛేదనలో భాగంగా ఇంగ్లండ్‌కు శుభారంభం దక్కలేదు. సాల్ట్(5), కెప్టెన్ బ్రూక్(7), బాటన్(17) నిరాశపరిచినా.. బట్లర్(25)కి తోడు బేథెల్ (105) సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. చివరి 4ఓవర్లను టీమిండియా బౌలర్లు కట్టడిగా వేసినా.. కేవలం 7పరుగుల తేడాతో మాత్రమే ఇంగ్లండ్ ఓటమిపాలైంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు న్యూజిలాండ్‌తో తల పడనుంది. టీమిండియా బౌలర్లు హార్దిక్ పాండ్యాకు రెండు, బుమ్రా, ఆర్షదీప్, అక్షర్, వరుణ్‌కి ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)సాల్ట్ (బి)విల్ జాక్స్ 89, అభిషేక్ శర్మ (సి)సాల్ట్ (బి)జాక్స్ 9, ఇషాన్ కిషన్ (సి)విల్ జాక్స్ (బి)ఆదిల్ రషీద్ 39, దూబే (రనౌట్)బ్రూక్ 43, సూర్యకుమార్ (స్టంప్)బట్లర్ (బి)ఆదిల్ రషీద్ 11, హార్దిక్ పాండ్యా (రనౌట్) బేథెల్/బట్లర్ 27, తిలక్ వర్మ (బి)ఆర్చర్ 21, అక్షర్ పటేల్ (నాటౌట్) 2, వరుణ్ చక్రవర్తి (నాటౌట్) 0, అదనం 12. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 253పరుగులు.

వికెట్ల పతనం: 1/20, 2/117, 3/160, 4/190, 5/212, 6/236, 7/251

బౌలింగ్: ఆర్చర్ 4-0-61-1, విల్ జాక్స్ 4-0-40-2, ఓవర్టన్ 3-0-36-0, కర్రన్ 4-0-53-0, ఆదిల్ రషీద్ 4-0-41-2, డాసన్ 1-0-19-0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)అక్షర్ (బి)హార్దిక్ 5, బట్లర్ (బి)వరుణ్ చక్రవర్తి 25, బ్రూక్ (సి)అక్షర్ (బి)బుమ్రా 7 బేథెల్ (రనౌట్) హార్దిక్/సంజు 105, బాటమ్ (బి)అక్షర్ 17, విల్ జాక్స్ (సి)దూబే (బి)ఆర్షదీప్ 35, సామ్ కర్రన్ (సి)తిలక్ వర్మ (బి)హార్దిక్ 18, ఓవర్టన్ (నాటౌట్) 2, ఆర్చర్ (నాటౌట్) 19, అదనం 13. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 246పరుగులు.

వికెట్ల పతనం: 1/13, 2/38, 3/64, 4/95, 5/172, 6/222, 7/225

బౌలింగ్: ఆర్షదీప్ 4-0-51-1, హార్దిక్ 4-0-38-2, బుమ్రా 4-0-33-1, వరుణ్ చక్రవర్తి 4-0-64-1, అక్షర్ పటేల్ 3-0-35-1, దూబే 1-0-22-0.

# 99 డేస్ యాక్షన్ ప్లాన్

మొదటి తరువాయి

ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి నుంచి అర్జీలు స్వీకరించటంతో పాటు ప్రజలతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలోని సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. అప్పుడు ప్రజల నుంచి వచ్చిన అర్జీలతోనే ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసింది. అక్కడ తీసుకున్న అర్జీల ఆధారంగానే రైతు రుణమాఫీ, రైతు భరోసా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కళ్యాణలక్ష్మి, షాధీ ముబారక్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ. సన్న బియ్యం పంపిణీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ పథకాలను అమలు చేసింది. ఇప్పుడు మూడోసారి 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణకు నడుం బిగించింది. పౌర సేవలు, ప్రజల అవసరాలతో మమేకమై ఉండే అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక కార్యక్రమాలు తల పెట్టింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అయిదు స్థాయిల్లో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతోంది. మార్చి 6 నుంచి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో పారిశుధ్యంతో పాటు పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయనుంది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు.. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముందస్తు ఉత్సవంగా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్య దర్శులను ఇందులో భాగస్వాములను చేసింది. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణతో పాటు మండల, పట్టణ, నియో జకవర్గ, జిల్లా కేంద్రాల్లో సరికొత్త కార్యాచరణకు నడుం బిగించింది. మండల, జిల్లా కేంద్రాల్లో వివిధ శాఖల అధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనుంది. అన్ని స్థాయిల్లోనూ గ్రామ సర్పంచి నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసేలా మార్గదర్శకాలను రూపొందించింది. రెండేండ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, వాటితో లబ్ధి పొందిన కుటుంబాలు, ఆయా వర్గాలకు చేసిన మేలును క్షేత్ర స్థాయిలో వివరించడంతో పాటు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు తప్పకుండా అందించాలనే సంకల్పంతో ఈ సభలను ఏర్పాటు చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో వస్తున్న సంస్కరణలు, వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దే ప్రణాళికను ప్రజలకు వివరించనుంది. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభించే 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను గుర్తించి, పిల్లల తల్లితండ్రుల్లో అవగాహన పెంచనుంది. విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్, ప్రధానంగా సోలార్ విద్యుత్ వినియోగం పెంచటం, దాని ఉత్పత్తి ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలను ప్రజలకు, రైతులకు తెలియజేయనున్నది. ఖాళీ స్థలాలుండి ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలనే ప్రజా ప్రభుత్వ లక్ష్యాన్ని నూటికి నూరు పాళ్లు అమలయ్యేలా చూడాలని సంకల్పించింది. పదేండ్లుగా ఇవ్వని రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ ఇవ్వాలనీ, ఇదో నిరంతర ప్రక్రియగా అమలు చేయాలని నిర్ణయించింది. యువతకు నైపుణ్యాల శిక్షణతో పాటు ఉపాధి కల్పించే కార్యక్రమాలు 99 రోజుల యాక్షన్ ప్లాన్లో చేపట్టనుంది. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో జాబ్ మేళాలు నిర్వహించి లక్ష మంది యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనేది టార్గెట్‌గా ఎంచుకుంది. ఇందిరా మహిళా శక్తి సాధిస్తున్న విజయాలను, కొత్తగా వ్యాపారాభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించనుంది. అన్ని జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను ప్రారంభించనుంది.

# ఇకపై ఫోన్‌లోనే బస్‌పాస్‌లు

మొదటి తరువాయి

**యాప్ ద్వారా ఐదు రకాల పాస్‌లు**

ఆర్టీసీ ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన 'మీ టికెట్' యాప్‌ను మరింత ఆధునీకరిస్తూ.. అందులో బస్‌పాస్ సేవలను కూడా చేర్చింది. విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర సాధారణ ప్రయాణికులు ఇకపై తమ మొబైల్‌లోనే బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకునేలా వీలు కల్పించింది. అంతేగాక ఈ నెల 25 నుంచి ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే కింది సదుపాయాలను పొందేలా ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా దూర ప్రాంత ప్రయాణికులు తమ ప్రయాణానికి అవసరమైన టికెట్లను యాప్ ద్వారానే ముందుగా బుక్ చేసుకోవచ్చు. జనరల్ ఆర్డీనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ, పుష్పక్ ఏసీ బస్సులకు సంబంధించిన బస్‌పాస్‌లను ఈ యాప్ ద్వారానే పేమెంట్ చేసి పొందవచ్చు.

**ప్రయాణికులకు అదనపు సౌకర్యం**

ఈ కొత్త విధానం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, కౌంటర్ల వద్ద రద్దీ కూడా తగ్గుతుంది. ముఖ్యంగా కాలేజీ విద్యార్థులకు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు ఈ సదుపాయం ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో డిజిటలైజేషన్‌లో భాగంగా మరిన్ని సేవలను 'మీ టికెట్' యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీ యాజమాన్యం యోచిస్తోంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

**కేంద్రాల్లోనూ సేవలు యథావిథి..**

డిజిటల్ సేవలతో పాటు నేరుగా కేంద్రాలకు వెళ్లి పాస్‌లు తీసుకోవాలనుకునే వారి కోసం గ్రేటర్ హైదరాబాద్‌లోని 42 అడ్వాన్స్ టికెట్ బుకింగ్, బస్‌పాస్ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి. ప్రతిరోజూ (ఆదివారంతో కలిపి) ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులు, వికలాంగులు, విద్యార్థులు, జర్నలిస్టులు, డయాలసిస్ రోగులు తమకు వర్తించే పాస్‌లను ఈ కేంద్రాల్లో తీసుకోవచ్చు.

**ఎలా అప్లై చేయాలి?**

ముందుగా మీ స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'మీ టికెట్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తర్వాత, 'బస్ పాస్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ మీ వివరాలు, ఫోటో, అవసరమైన ధ్రువపత్రాలను (అవసరమైతే) అప్‌లోడ్ చేయాలి. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఫీజు చెల్లించగానే, డిజిటల్ బస్‌పాస్ మీ మొబైల్‌కే వస్తుంది. దీన్ని మీరు ప్రయాణ సమయంలో కండక్టర్‌కు చూపించవచ్చు.

# అభివృద్ధి కావాలి.. విధ్వంసం వద్దు

మొదటి తరువాయి



తీసుకువస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తెలంగాణలో "బుల్డోజర్ రాజ్యం" నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగోల్‌లో మూసీ అభివృద్ధి జరిగిన ప్రాంతాన్ని, నాగోల్ ఎస్టీపీని గురువారం ఆయన పరిశీలించి బాధితులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేవలం వేల కోట్ల రూపాయల అవినీతి కోసం నగరంలో మూసీ ప్రాజెక్టు పేరిట లక్షన్నర మంది పేదల ఇండ్లను కూల్చివేయడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేదల ఇండ్లను కూల్చడానికి ప్రయత్నిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వం ఒక్క ఇల్లు కట్టినట్టు నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాలను వదిలేస్తానని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నాగోల్‌లో ఐదున్నర కిలోమీటర్ల మేర మూసీ నది తీరాన్ని ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేశామని కేటీఆర్ తెలిపారు. అప్పట్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టామని అన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ నేతలతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించామని చెప్పారు. మూసీ సుందరీకరణకు తమ పార్టీ మద్దతిస్తుంది కానీ.. ఆ పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని మాత్రం అంగీకరించబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. లేకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. మూసీ పేరిట హైదరాబాద్‌లో సృష్టిస్తున్న విధ్వంసాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బలంగా లేవనెత్తుతామని తెలిపారు. పేదల జోలికి వస్తే వారే నీ కుర్చీని మడతపెడతారని హెచ్చరించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఉన్నప్పుడు కేసీఆర్ ఆలోచన విధానంతో పేదలకు నష్టాలు వాటిల్లకుండా తక్కువ వ్యయంతో సుందరీకరణ ప్రణాళికలు తయారుచేసి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. వాటిలో భాగంగానే 32 ఎస్టీపీలు ఏర్పాటు చేసి 2023 నాటికి 80 శాతం పనులు పూర్తి చేశామని అన్నారు. నాగోల్‌లో ఉన్న ఎస్టీపీ రోజుకు 320 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ వాణీ దేవి, మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ తదితర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మూసి నది పరివాహక ప్రాంత బాధితులు పాల్గొన్నారు.

# అగ్నికి అటవి సంపద ఆహుతి

## వన్యప్రాణుల ఆర్తనాదాలు



**పాలకుర్తి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకుర్తి మండలం పుట్నూరు, ఈశాల, తక్కల్లపల్లి గ్రామాల శివారులోని గుట్టలలో వారం రోజులుగా అగ్నికిలలు చెలరేగి అటవి సంపద కాలి బూడిదవుతోంది. ఎండాకాలం ఆకురాలే సమయం కావడంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి.ఈ మంటల్లో వన్యప్రాణులు ఆర్తనాదాలు చేస్తూ సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే అడవి నాశనం అవుతోందని ప్రకృతి, జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. అడవికి నిప్పు పెట్టడం మానవ మనుగడకే కాకుండా వన్యప్రాణులకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని ప్రజలకు అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.ప్రస్తుతం మంటలు అల్ట్రాటెక్ సున్నపు రాయి గనుల గుట్ట నుండి బుగ్గ గుట్ట వరకు వ్యాపించే ప్రమాదం ఉన్నందున అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి మంటలను ఆర్పివేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రమాదకరంగా మారిన మూలమలుపులు ప్రజల్లో ఆందోళన



**పాలకుర్తి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: పాలకుర్తి మండలం బసంతనగర్ నుండి ఈశాల, తక్కల్లపల్లి గ్రామం వరకు ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా చెట్ల పొదలు, వ్యవసాయ బావులు, రోడ్డుపై గుంతలు ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.ఇరుకు రహదారి, చెట్ల పొదల అడ్డంకులు కారణంగా ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. రాత్రివేళ వీధి దీపాలు లేకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. అల్ట్రాటెక్ కంపెనీ కార్మికులు, విద్యార్థులు రాత్రి ప్రయాణం చేస్తూ ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనతో వెళ్తున్నారు.ప్రజలు నాయకులు, అధికారులు తక్షణమే స్పందించి బసంతనగర్ నుండి ఈశాల, తక్కల్లపల్లి గ్రామ శివారు వరకు మూలమలుపుల వద్ద చెట్ల పొదలను తొలగించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థులకు కవ్వంపల్లి అభినందనలు



**మానకొండూర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థులుగా ఖరారైన సిట్టింగ్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.గురువారం వారు హైదరాబాదులో నామినేషన్లు దాఖలు చేయగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

## -- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**పెద్దపల్లి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మార్చి 6 నుంచి 15 వరకు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల కార్యాచరణ అమలు పై జిల్లా అధికారులు, డిసిపి రాం రెడ్డి తో కలిసి సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా ముందస్తుగా పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యతతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టి పాత ఫర్నీచర్ తొలగించాలని, పెండింగ్ ఫైల్స్‌ను 10 రోజుల్లో క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు 10 రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తూ, ఫీల్డ్ లెవల్ తనిఖీలు చేసి రోడ్లపై చెత్త లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలని, పబ్లిక్ ప్లేసెస్ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.పారిశుద్ధ్య డ్రైవ్ అనంతరం కూడా స్థానిక సంస్థల అధికారులు రెగ్యులర్‌గా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, ప్రతివారం గ్రామం, అర్బన్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణపై రిపోర్టులు అందించాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం ఒక శాఖకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, ఆరోగ్యం, సంక్షేమం, చైల్డ్ సేఫ్టీ, వ్యవసాయం, విద్య, యువత, మహిళా సంక్షేమం, పర్యావరణం వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఏప్రిల్ 2న గ్రామ స్థాయి, ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి, జూన్ 2న రాష్ట్ర స్థాయి సమావేశాలు జరుగుతాయని, వీటిలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా సహకార అధికారి మాల, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురికాకుండా

# జాగ్రత్తలు పాటిద్దాం

### - రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లలితా దేవి



**రంగారెడ్డి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలందరూ వడదెబ్బపై పూర్తి అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లలితా దేవి ఒక ప్రకటనలో సూచించారు. "వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం -- వడదెబ్బ వలన సంభవించే మరణాలను అరికడదాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఎండ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగి మెదడుపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రించే మెదడు కేంద్రం దెబ్బతిని హీట్‌స్ట్రోక్ లేదా సన్‌స్ట్రోక్ సంభవిస్తుందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమై ప్రాణాంతకమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.వడదెబ్బ లక్షణాలుగా చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం, వణుకు పుట్టడం, మగత, కలవరింతలు, ఫిట్స్ రావడం లేదా అపస్మారక స్థితి కనిపిస్తాయని వివరించారు. ఎండలో బయటికి వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యున్ని సంప్రదించాలని సూచించారు.వడదెబ్బ నివారణకు గొడుగు వాడటం, తెలుపు రంగు లేదా పలుచటి వస్త్రాలు ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు ధరించడం, వేడి గాలులు తగలకుండా జాగ్రత్తపడడం, ఉదయం పదకొండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆరుబయట పనులు చేయకపోవడం, ప్రయాణాలు ఉదయం పదకొండు గంటల లోపు లేదా సాయంత్రం నాలుగు గంటల తరువాత చేయడం, ఇంటి నుండి బయలుదేరే ముందు ఒక గ్లాసు నీరు త్రాగడం, ఎండలో తిరిగేటప్పుడు తాగునీరు వెంట తీసుకువెళ్లడం వంటి చర్యలు పాటించాలని సూచించారు.వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడగల ప్రదేశానికి తీసుకెళ్లి చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు చల్లబరుస్తూ ఉండాలని, చల్లని గాలి తగిలేలా చూడాలని తెలిపారు. డీహైడ్రేషన్ నివారణకు ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓఆర్ఎస్ త్రాగించవచ్చని చెప్పారు. అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదని, వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వడదెబ్బ నివారణ చర్యలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ లలితా దేవి విజ్ఞప్తి చేశారు.

# ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్




**ఆమనగల్లు, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**

ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ ఉదయం 6 గంటలకు మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది హాజరు, పనితీరు పరిశీలించి, శుభ్రత పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం 14వ వార్డులో కౌన్సిలర్ వెంకటయ్య తో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను స్వయంగా ప్రజావేక్షించి వీధుల శుభ్రత పనులు చేయించారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటయ్య, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ,మార్చి 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**


జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఆల్ఫా జూనియర్ కాలేజ్, వేదాంత జూనియర్ కాలేజ్ లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా త్రాగునీరు, శుభ్రమైన మూత్రశాలలు, ప్రథమ చికిత్సతో కూడిన మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ లేదా మాస్ కాపీయింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా హాలులోకి అనుమతించాలని పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.

# ఓటుతో ఒరిగిందేముంది?

## ప్రజాస్వామ్యం ముసుగులో రాజరికం

ఖజానా అంతా ఖద్దర్ పాలు...
క్యాస్ట్‌ను పట్టుకో... క్యాష్‌ను కొట్టు...
ఓటుతో ఒరిగిందేముంది?

**ప్రజాస్వామ్యం పేరుతో అధికార రాజకీయాలు ప్రజల ఆశయాలను మింగేస్తున్నాయా?**




ప్రజాస్వామ్యం అనేది ప్రజల చేతుల్లో ఉన్న అత్యంత గొప్ప శక్తి అని చెప్పుకుంటాం. కానీ నేటి రాజకీయ పరిస్థితులను గమనిస్తే, ప్రజాస్వామ్యం పేరుతో మరో రూపంలో రాజరికం కొనసాగుతోందా అనే సందేహం సహజంగా తలెత్తుతోంది. మద్యపు మత్తులో ప్రజలు, అధికార మత్తులో పాలకులు అనే వ్యాఖ్యలు సమాజంలో తరచూ వినిపిస్తున్నాయి.

ఒకప్పుడు ప్రజల హక్కుల కోసం పోరాడిన ఉద్యమాలు, అడవుల్లో ఆయుధాలు ఎత్తుకున్న పోరాటాలు సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆశతో సాగాయి. కానీ దశాబ్దాల పాటు జరిగిన ఆ పోరాటాల ఫలితం ఏమిటి అన్న ప్రశ్న నేటి తరంలో వినిపిస్తోంది. ప్రజల కోసం ప్రారంభమైన ఉద్యమాలు చివరకు ప్రజల జీవితాల్లో ఎంత మార్పు తీసుకువచ్చాయన్నది పరిశీలించాల్సిన అంశంగా మారింది.

**ఒక పార్టీ పోతే మరో పార్టీ వస్తుంది**
**వారు పోతే వీరు వస్తారు...**
**కానీ ప్రజల జీవితాల్లో మార్పు కనిపించకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమేంటి?**

ప్రజాస్వామ్యంలో పార్టీలు ప్రజల సేవ కోసం పోటీ పడాలి. కానీ వాస్తవ పరిస్థితుల్లో చూస్తే పార్టీలు అధికార పోటీకి మాత్రమే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం పెరుగుతోంది. ఎన్నికల సమయంలో "క్యాస్ట్‌ను పట్టుకో... క్యాష్‌ను కొట్టు" అనే రాజకీయ సంస్కృతి బలపడుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక పార్టీ పోతే మరో పార్టీ వస్తోంది కానీ పాలనా విధానాల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదనే నిరాశ ప్రజల్లో పెరుగుతోంది.

చరిత్రను చూస్తే రాజరిక వ్యవస్థలో కూడా రాజులు ప్రజల కోసం కొన్ని శాశ్వత పనులు చేసేవారు. చెరువులు, రహదారులు, దేవాలయాలు, సామూహిక నిర్మాణాలు వంటి పనులు సమాజానికి ఉపయోగపడేవి. కానీ నేటి ప్రజాస్వామ్యంలో ప్రజల ఖజానా ప్రజల అభివృద్ధికి ఎంతవరకు ఉపయోగపడుతోంది అన్న ప్రశ్న తరచూ వినిపిస్తోంది. "ఖజానా అంతా ఖద్దర్ పాలు" అనే వ్యాఖ్య ప్రజల్లో వినిపించడం కూడా యాదృచ్ఛికం కాదు.
ఇంకొకవైపు ప్రభుత్వ వ్యవస్థలో కూడా మార్పు అవసరమనే చర్చ పెరుగుతోంది. ఒకసారి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తరువాత జీతం ప్రభుత్వంనుంచి వస్తున్నా, సమాజ బాధ్యతల కంటే వ్యక్తిగత ప్రయోజనాల దిశగా జీవనం సాగుతోందనే విమర్శలు కొందరిలో వ్యక్తమవుతున్నాయి. సమాజ ప్రయోజనం కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు ముందుకు రావడం వల్ల వ్యవస్థపై ప్రజల నమ్మకం తగ్గిపోతుందనే ఆందోళనలు ఉన్నాయి.ఎన్నికల విధానం కూడా కొన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒక నియోజకవర్గంలో 81 శాతం పోలింగ్ జరిగిందనుకుందాం. గెలిచిన అభ్యర్థికి 41 శాతం ఓట్లు, ఓడిన అభ్యర్థికి 40 శాతం ఓట్లు వచ్చినా ఫలితం పూర్తిగా ఒకవైపే ఉంటుంది. అంటే దాదాపు సమాన మద్దతు ఉన్నప్పటికీ కేవలం ఒక శాతం తేడాతో నిర్ణయం మారిపోతుంది. ప్రజల అభిప్రాయాల పూర్తి ప్రతిబింబం రాజకీయ వ్యవస్థలో కనిపించకపోవడం వల్ల ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ప్రజాస్వామ్యం బలపడాలంటే కేవలం ఎన్నికలు జరగడం సరిపోదు. రాజకీయ సంస్కృతి, పాలనా పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం అన్నీ కలిసి పనిచేయాలి. ప్రజల ఆశయాలను ప్రతిబింబించే విధంగా వ్యవస్థ మారితేనే ప్రజాస్వామ్యం తన అసలైన అర్థాన్ని పొందుతుంది.
చివరగా సమాజం ఎదుట నిలిచే ప్రశ్న ఒక్కటే – ఓటుతో నిజంగా మార్పు వస్తుందా? లేక ప్రజాస్వామ్యం పేరుతో అదే చక్రం తిరుగుతూనే ఉంటుందా?

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**(సీనియర్ జర్నలిస్ట్)**



# షాద్‌నగర్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సీతారాం




**షాద్‌నగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా కె. సీతారాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా ఏడాదిన్నర కాలంగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో సీతారాం నియమితులయ్యారు.పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో చేరిన సీతారాం కు సిబ్బంది స్వాగతం పలికారు.

# ఆదర్శంగా విద్యార్థి ఉపాధ్యాయులు

-విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ.స్వపరిపాలన దినోత్సవ వేడుకలు.



**దేవరకొండ మార్చి 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో గురువారం నాడు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ఉపాధ్యాయులు గా విధులు నిర్వహించారు.ప్రిన్సిపాల్ గా రమ్యశ్రీ, ఎంఇఓ గా మహేశ్వరి,డిఇఓ గా సాయి శ్రేయ,ఏడి గా స్పందన, జేడీ గా నిశిత, ఎమ్మార్వో గా అనూష, ఎంపిడిఓ శ్రావ్య, ఎంపీ గా అక్షిత, ఎమ్మెల్యే గా ఆకాంక్ష, విద్యా శాఖ మంత్రి గా ముజాంబిర్, విధులు నిర్వహించారు.ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయుల బోధన ఎంత గొప్పదో అర్థమయ్యిందని, తక్కువ సమయంలో వాళ్ల విధులు చక్కగా నిర్వహించారని అన్నారు.విద్యార్థులు వాళ్ల అనుభవాన్ని పంచుకుంటూ ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎంతో శ్రమకోర్చి మమ్మల్ని భరిస్తున్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, చింత బిచ్చయ్య,రమా, సుశీల, రాచమల్ల వెంకటేశ్వర్లు, నారిమల్ల ఎన్ విజయ్ కుమార్, పులి కోదండ రామారావు, ఇమ్మడి చెన్నయ్య, గోరటి సోమయ్య, పి.రవి, కొప్పు బాలకృష్ణ, వి.విజయ్, శ్రీను శ్రీలత, ధనలక్ష్మి,రుంషా, పి.రాజు, వి.రమేష్, పిడి రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ఉగాది లోపు గృహప్రవేశాలు చేయాలి

## జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ,మార్చి 5 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి ఉగాది పండుగకు ముందే పూర్తిచేసుకుని గృహప్రవేశాలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం తిప్పర్తి మండలం, శిలార్మియా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు . పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పేద ప్రజలకు స్వంత గృహాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని , ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల రూపాయల సహాయంతో లబ్ధిదారులు తమ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారు రాయి కరుణమ్మ ఇంటికి వెళ్లి ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చు అయిందని అడిగారు. అప్పులు తీసుకుని ఇళ్లు కట్టుకోవద్దని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను పూర్తిచేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. గ్రామాలలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో మురుగు, చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ స్థలాల్లో చెత్త వేస్తే సంబంధిత వ్యక్తులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని, ఊరి అవతల చెత్త నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని , గ్రామాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా అధికారులతో కలిసి సహకరించాలని కోరారు

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ రాంసింగ్ నాయక్

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంజూరైన సీసీ రోడ్డు.



**దేవరకొండ మార్చి 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో ఎంజిఎన్ఆర్ జీఎస్ నిధుల నుంచి మైనంపల్లి గ్రామంలో మంజూరైన 5 లక్షల వ్యయంతో కూడిన సీసీ రోడ్డు పనులను బీచ్యతాండ లో మైనంపల్లి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ అధికారులు. పాలకవర్గ సభ్యులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ నాయక్.పంచాయతీ రాజ్ డీఈ లింగారెడ్డి. ఏ ఈ.శంకర్. వార్డు సభ్యులు కిషన్.లక్ష్మీ ప్రశాంత్. సంతోష వెంకట్.గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేసవి పనుల్లో జాగ్రత్తలు అవసరం

## డీఆర్డీవో ప్రవీణ్‌కుమార్



**ఎలిగేడు, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రస్తుత వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో ఉపాధి హామీ కూలీలు పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు డీఆర్డీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం ఎలిగేడు మండల కేంద్రంలోని రోడ్డు పనులను, లాలపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే ఉదయాన్నే పనులకు వచ్చి, ఎండ తీవ్రత పెరిగేలోపు నిర్ణీత పనులను ముగించుకుని ఇంటికి వెళ్లిపోవాలని కూలీలకు సూచించారు. కూలీలు పనిచేసే చోట త్రాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, ఫస్ట్‌ఎయిడ్ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని పానీయాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఏపీవో సదానందం, సర్పంచులు కప్పల ప్రవీణ్, ఏలేటి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంజలి, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.



**నల్లగొండ ,మార్చి 5 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా ముచ్చటించారు విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండ ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించాలని విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపారు.

## బడుగు బలహీన వర్గాల మహనీయుడు బుర్ర కొండయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం





బుర్ర కొండయ్య ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎలిగేడు ఉప సర్పంచ్ ముంజం నరేష్.

**ఎలిగేడు, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు చేసిన బుర్ర కొండయ్య మహనీయుడని ఎలిగేడు గ్రామ ఉపసర్పంచ్ ముంజం నరేష్ అన్నారు. గురువారం ఆయన రెండో వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ, "గీత కార్మికుల హక్కుల సాధనకు, నిరుపేద ప్రజల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన బుర్ర కొండయ్య ఈ ప్రాంత ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నిస్సి క్రిస్టన్, ఎలిగేడు ప్రభుత్వ పాఠశాల మాజీ విద్యా కమిటీ అధ్యక్షుడు అడ్డగుంట తిరుపతి, పలు సంఘాల నాయకులు కవ్వంపల్లి నారాయణ, సంపత్, నరేందర్, కేక్కర్ల చందు, పురుషోత్తం, అజయ్, తాటి పెల్లి సతీష్ బాబు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌డబ్ల్యుఓల ఫోరం వార్షిక డైరీ 2026 ఆవిష్కరణ

- పాల్గొన్న ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ





**హైదరాబాద్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం వార్షిక డైరీ 2026 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. మాసాబ్‌ట్యాంక్‌లోని డి.ఎస్.ఎస్. భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ కలిసి డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ, ఎన్నో వ్యయప్రయాసలతో రూపొందించిన ఈ వార్షిక డైరీ వసతి గృహ సంక్షేమ అధికారులకు ఉపయోగపడే అంశాలతో నిండి ఉందని అభినందించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ, చాలా కాలం తర్వాత రూపొందించిన ఈ వార్షిక డైరీకి సహకరించిన రాష్ట్రంలోని వసతి గృహ సంక్షేమ అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, యాదాద్రి, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల ఫోరం అధ్యక్షులు బోనాల రవి, శైలజ రేఖల, డాక్టర్ పి.కృష్ణమోహన్, కృష్ణ, ఎస్సీడిడి ఎంఎస్ఏ సలహాదారు ఈ.రత్నాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానంద్ కళ్యాణ్, నేతలు పి.బాబురావు, శివకుమార్, సత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట జిల్లా నుంచి రాజు, జగిత్యాల జిల్లా నుంచి అప్సర్, వరంగల్ నుంచి నాగరాజు, ఖమ్మం నుంచి వేణు, కామారెడ్డి నుంచి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం



**హన్మకొండ, మార్చి 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)** :నూతన వధూవరులను ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆశీర్వదించారు. గురువారం హంటర్ రోడ్డు సిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ లో అనిమిరెడ్డి నారాయణరెడ్డి మనుమడు అశ్విత్ రెడ్డి - ప్రియాంక వివాహ మహోత్సవానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ కక్కె సారయ్య, వర్ధన్నపేట మాజీ సర్పంచ్ అనిమిరెడ్డి మధుసూదన్ రెడ్డి, తుమ్మల యాకయ్య,గాడిపల్లి హరిబాబు, తుమ్మల రమేష్, శ్రీధర్, రాజు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేనొక నిరుద్యోగిని




ఏమని చెప్పుకోను ఎంతని చెప్పుకోను
ఆరు కాలం కష్టపడి పెంచిన నా తల్లిదండ్రులకు నేను భారమయ్యాననీ చెప్పుకోనా...
ఏం చేస్తున్నావ్ అని అడిగితే ఉద్యోగం అనే వేటలో పరిగెడుతున్నానని చెప్పుకోనా...
అహర్నిశలు కళ్ళకు కాయలు కాసేటట్టు చదివిన ప్రభుత్వ నోటిఫికేషన్లు రాక చదివి చదివి అలసిపోయానని చెప్పుకోనా..
తిన్నావా బిడ్డ అని అమ్మ అడిగితే తినకపోయినా ఇప్పుడే తిన్న అమ్మ అని చెప్పుకోనా...
కోచింగ్ సెంటర్లకు ఫీజులు కట్టి కట్టి చివరకు మా తల్లి తాళిబొట్టు కూడా తాకట్టు పెట్టానని చెప్పుకోనా..
బిడ్డ అప్పులయ్యాయని నాన్న చెప్తే ఉద్యోగంలో చేరాక అప్పులన్నీ తీరుస్తాలే అని చెప్పుకోనా...
వయసు మీద పడుతుందని స్నేహితులు గుర్తుచేస్తుంటే జీవితం అయిపోతుందని బాధపడనా..
ఎప్పుడొస్తుంది ఉద్యోగం అని అడిగితే నోటిఫికేషన్ రాగానే అని చెప్పుకోనా..
నేనొక నిరుద్యోగిని అని నాకై నేను సర్ది చెప్పుకొన.. కానీ నేను ఏదో ఒక రోజు ప్రభుత్వ ఉద్యోగిని.......

**హరీష్ సాగర్**
**6302758830**

# బీసీలపై కమ్ముకున్న నీలినీడలు...

### ప్రజాస్వామ్యంలో సమాన హక్కుల కోసం ఎదురుచూపులు



రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావశీల శక్తిగా నిలిచే బీసీ వర్గాలు ఇంకా సముచిత ప్రాతినిధ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ రాజకీయ ప్రజాస్వామ్య ఫలాలు అందని ద్రాక్షలా మిగిలిపోవడం వెనుక కారణాలు ఏమిటి? ఎన్నికల సమయం రాగానే బహుజన నినాదాలతో హామీల వర్షం కురిపించే రాజకీయ వ్యవస్థ, ఆ తరువాత మాత్రం బీసీల ఆశలను ఎందుకు విస్మరిస్తోంది అన్న ప్రశ్నలు సమాజంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్న బీసీ వర్గాలు ఎన్నికల ఫలితాలను నిర్ణయించే శక్తిగా ఉన్నప్పటికీ పాలనా వ్యవస్థలో వారి వాటా మాత్రం తక్కువగానే కనిపిస్తోంది. దేశంలో బీసీల జనాభా సుమారు 55 శాతం వరకు ఉందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే వారికి లభిస్తున్న రిజర్వేషన్ కేవలం 27 శాతం మాత్రమే. ఇది సామాజిక న్యాయం దృష్ట్యా అనేక సందేహాలకు తావిస్తోంది. ఇతర వర్గాలతో పోల్చితే ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఓసీ వర్గాల జనాభా సుమారు ఐదు శాతం ఉన్నప్పటికీ వారికి పది శాతం రిజర్వేషన్ కల్పించబడింది. ఎస్సీ వర్గాలు పన్నెండు శాతం ఉండగా వారికి పదిహేను శాతం, ఎస్టీ వర్గాలు తొమ్మిది శాతం ఉండగా వారికి పది శాతం రిజర్వేషన్ లభిస్తోంది. అయితే జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు మాత్రం కేవలం 27 శాతం రిజర్వేషన్ మాత్రమే ఉండడం సామాజిక వర్గాల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక వనరుల పంపకాల వంటి అనేక రంగాల్లో కూడా బీసీలు తగిన అవకాశాలు పొందడంలో వెనుకబడుతున్నారనే భావన సమాజంలో ఉంది. ఎన్నికల సమయంలో బీసీల అభ్యున్నతే తమ అజెండా అని ప్రకటించే రాజకీయ పార్టీలు, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో మాత్రం తగిన చిత్తశుద్ధి చూపడం లేదనే విమర్శలు తరచుగా వినిపిస్తున్నాయి. ఫలితంగా బీసీ వర్గాల అభివృద్ధి ఆశలు ఇంకా నెరవేరని ఆకాంక్షలుగానే మిగిలిపోతున్నాయి. ఈ పరిస్థితులకు కారణం రాజకీయ పార్టీల వ్యూహాలా? లేక బీసీ వర్గాల మధ్య ఐక్యత లోపమా? అనే చర్చ కూడా కొనసాగుతోంది. బీసీ కులాల మధ్య ఐక్యత కొరవడటం, సామాజిక-రాజకీయ అవగాహన కొంత మేర తగ్గిపోవడం కూడా వారి ప్రతినిధిత్వం తగ్గడానికి ఒక కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగబద్ధ పదవులు, నామినేటెడ్ పోస్టులు, కీలక రాజకీయ పదవులలో బీసీలకు తగిన స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి.

**చైతన్యం కలిగితే మార్పు సాధ్యం**

బీసీ వర్గాలు చైతన్యవంతులై ఐక్యంగా ముందుకు వస్తే రాజకీయ సమీకరణాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మౌనంగా ఉన్న గొంతుకలు ఒక్కసారి స్వరం పెంచితే బూటకపు హామీలకు ముగింపు పలికే పరిస్థితి ఏర్పడవచ్చు. శతాబ్దాలుగా వెనుకబడిన వర్గాలుగా మిగిలిపోయిన బీసీ యువత చైతన్యంతో ముందుకు వస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాన అవకాశాల కోసం కొత్త పోరాటానికి నాంది పలకవచ్చు. అభిమన్యుడి వీరత్వాన్ని వారసత్వంగా మోసుకొస్తున్న బీసీ యువత ఐక్యంగా కదిలితే సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషించగలదు. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికి సముచిత ప్రాతినిధ్యం లభించాలంటే బీసీలకు కూడా తగిన స్థానం కల్పించడం తప్పనిసరి. అసంపూర్ణంగా మిగిలిపోయిన హామీలతో బీసీలను మోసం చేయకుండా, రాజ్యాంగబద్ధంగా వారికి లభించాల్సిన రిజర్వేషన్లు మరియు అవకాశాలను సముచితంగా అమలు చేయడం ప్రభుత్వాల బాధ్యత. విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో బీసీలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే సమగ్ర సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. బీసీ వర్గాల అభ్యున్నతి కేవలం ఒక వర్గానికే కాదు, సమాజం మొత్తం అభివృద్ధికి మార్గదర్శకం కావాలని ప్రజాస్వామ్య వ్యవస్థ గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

**గోరుపాటి శంకర్**
(కవి, రచయిత & జర్నలిస్ట్)
ఎం.ఏ తెలుగు, ఉస్మానియా యూనివర్సిటీ
చరవాణి: 8179885282



# అక్రమ కేసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీపీఎం నాయకుడి భార్య




**పెద్దపల్లి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

స్మశానవాటికలో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి ఆశోక్‌పై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని ఆయన భార్య సౌజన్య ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేష్ కుట్రతో తన భర్తతో పాటు సీపీఎం మండల కమిటీ సభ్యుడు కుమ్మరి నవీన్‌ను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, గత ఆరు రోజులుగా శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సమయంలో, బుధవారం రాత్రి ఆడెపు వెంకటేష్, అతని అనుచరులు తీవ్రంగా దూషించారని, దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత అట్రాసిటీ కేసు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అయితే, ఫిర్యాదు చేసిన తన భర్తపైనే రివర్స్‌లో సోలార్ ప్లాంట్ నిర్వాహకుల వద్ద డబ్బులు డిమాండ్ చేశాడని అక్రమంగా కేసు పెట్టి, స్టేషన్ బెయిల్ అవకాశం లేకుండా నేరుగా కోర్టులో ప్రవేశపెట్టి జైలుకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని, మాజీ సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయించేందుకు జాతీయ, రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, సీపీఎం జిల్లా కౌన్సిల్ సభ్యుడు సీపెల్లి రవీందర్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మోదుంపల్లి శ్రవణ్, కుమ్మరి సందీప్, మదనపల్లి ప్రణయ్, కల్లెపల్లి రవి, కుమ్మరి స్వర్ణ ప్రకాష్, కుమ్మరి సిద్ధూ, కల్లెపల్లి సూరజ్, కల్లెపల్లి సన్నీలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికపై సమీక్షా సమావేశం



**ఎలిగేడు, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం ప్రజాపాలన--ప్రగతి 99 రోజుల కార్యక్రమంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి మరిన్ని పనులు కల్పించాలని, పన్నుల వసూళ్ల శాతం వందకు పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నర్సరీల నిర్వహణను సమర్థవంతంగా కొనసాగించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో బాస్కరరావు, ఎంపీవో కిరణ్, ఏపీవో సదానందం, సర్పంచులు ప్రవీణ్, రమాదేవి, రజిత, బాపయ్య, తిరుపతి, వెంకటేష్, కొమురయ్య, రంగులత, వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం




**కల్వకుర్తి, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో నిర్మాణంలో ఉన్న సిసి రోడ్ల పనులను మార్చి నెలలోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీరాజ్ డి.ఈ., ఏ.ఈ., ఎంపీవో, ఏపీఎం, ఏపీఓలు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్న ఈటల రాజేందర్



**కరీంనగర్ , మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, బీజేపీ నాయకులు చొప్పరి వేణు, ఎర్రబెల్లి సంపత్ రావు, పెద్ది మల్లారెడ్డి, రాజారామ్ గౌడ్, కళ్లేపు సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని శ్రీ గణపతి, శ్రీ పార్వతీ సమేత శ్రీ మహాలింగేశ్వర స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాల్లో కూడా ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు హుజూరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, పెద్ది మల్లారెడ్డి, ఎనగంటి శ్రీనివాస్ యాదవ్, చొప్పరి వేణు, రమేష్ గౌడ్, రాజారామ్ గౌడ్, నవీన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయితీల్లో సమన్వయ సమావేశం

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జైపూర్ మండలంలోని మిట్టపల్లి, కాన్కూర్ గ్రామలలో 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఎంపీఓ శ్రీపతి బాపూరావు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛదానం - పచ్చదనం పై ప్లాన్ తయారు చేయడం , పారిశుధ్యం, నర్సరీ నిర్వహణ , త్రాగునీటి మోటార్స్, ఇందిరమ్మ ఇండ్లు, నాలీల పూడిక తీయట, ముళ్ళ పొదలు తొలగించుట పనులు గుర్తించడం అంగన్వాడీ, యుపిఎస్ సందర్శన ,ఈజిఎస్ ద్వారా మ్యాజిక్ సోప్ కిట్స్ గుర్తించారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్




**నాగర్‌కర్నూల్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జీ.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జిల్లా పరిషత్ సీఈఓ, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ దేవసహాయం నుంచి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణపై చర్చించారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, "జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగేందుకు సమన్వయంతో కృషి చేస్తాను" అని తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌కు చెందిన శ్యామ్ ప్రసాద్ లాల్, గతంలో మహాత్మా జ్యోతిబా పూలే విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీగా పనిచేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్




**నాగర్‌కర్నూల్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం మాట్లాడుతూ, అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని వనపట్ల, గన్యాగుల, పెద్దముద్దునూరు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల వద్ద మిగిలి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పెండింగ్ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు ముఖ్యంగా పెయింటింగ్, ఎలక్ట్రికల్, డ్రైనేజీ వంటి పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులైన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీ హౌసింగ్ సంగప్ప, నాగర్‌కర్నూల్ ఎంపీడీవో, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమావేశం




**హుస్నాబాద్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి. మల్లికార్జున్ అధ్యక్షతన మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి మేనేజర్ సంపత్ రావు, టీ.ఓ. రోహిత్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మెప్మా ఎడిఎంసి సంతోషిమాతతో పాటు మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఓ నిరుద్యోగి వేదన!



కష్టాల కౌగిలిని అధిగమించి సంకల్పమే ఆయుధం అవుతూ విజయ కాంక్షతో బాధను దిగమించుకొని రేపటి భవిష్యత్తు అనే అందాల భవంతికి పునాది రాయి నిర్మించుకుంటూ సాగిపోయే కాలంతో కాదు కాలాన్నీ తన స్నేహంలా మలుచుకొని చదువు అనే చెలిమితో అర్ధరాత్రుల్లు తిప్పేసే పుస్తక పేజీల చప్పుళ్ళతో చైతన్యం అవుతూ లోపల ఒక ఋషి అయి బయట సాదాగా కనిపిస్తూ నిత్యం అంతర్మథనం పొందే ఓ నిరుద్యోగి కాలం పెట్టే పరీక్షకి సమాధానం కోసే ఎదురు ఆశా జీవి..

**శంకర్ (రచయిత,జర్నలిస్టు)**

## నాగెల్లి సురేష్ చిత్రపటానికి నివాళులర్పించిన ఈగ మల్లేశం



**వర్ధన్నపేట, మార్చి 05(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నాగెల్లి సురేష్ దశదినకర్మ కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని సురేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన నాగెల్లి సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని సురేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం , వారు మాట్లాడుతూ సురేష్ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మాజీ మేయర్ కక్కే సారయ్య, గాడిపల్లి హరిబాబు, రాజు, భాను, రమేష్, శ్రీను, రంజిత్, శ్రీరామ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీగా అండర్ డ్రైనేజీ పనులు పూర్తి

-మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు, మార్చి 5(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
దశలవారీగా అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ అన్నారు. గురువారం ఆయన ప్రతిభా నగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్ ఎంగళి భాగ్యలక్ష్మి తో కలిసి మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దశల వారీగా డ్రైనేజీ వ్యవస్థను పరిష్కరిస్తానని చైర్మన్ పత్య నాయక్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎంగలి రఘు, యాదగిరి, గుద్దేటి మహేష్ నేత, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జాన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**హుస్నాబాద్,మార్చి 5(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలోని శ్రీ స్వయంభూ లక్ష్మీ నరసింహ స్వామి వారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్నపురెడ్డి సురేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని, లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడి పంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కొలిపాక వేణు, కాసాని సతీష్, అరిగేలా రమేష్, గ్రామ సర్పంచ్ అల్లేపు సంపత్, ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోదరి అజయ్, బీజేపీ నాయకులు గాందే చిరంజీవి, కారంపురి వెంకటేశం, తిప్పారపు శ్రీనివాస్, పెండ్యాల రాజేందర్, శ్రీమంతుల వెంకటస్వామి, పడాలా శ్రీనివాస్, అప్పల శ్రీను, గంద్రతి రామయ్య, అరిగేలా రాజయ్య, పీర్ల రవీందర్, గడిపే శ్రీకాంత్, గడ్డం నందు, మామిడి కళ్యాణ్, దుద్దేల రాజు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు




**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో మహిళా సెల్ ఆధ్వర్యంలో బాలికల కోసం ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సన్‌రైజ్ హాస్పిటల్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ నయని ఇంజమూరి మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హార్మోన్ అసమతుల్యత వల్ల శరీరంలో జీవక్రియ సమస్యలు తలెత్తి అనేక రుగ్మతలకు దారితీస్తాయని తెలిపారు. సమతుల్యమైన ఆహారం, చిన్న జీవనశైలి మార్పులతో ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని సూచించారు.ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఆరోగ్యమే మహాభాగ్యం అని, విద్యార్థినుల ఆరోగ్యం కోసం విశ్వవిద్యాలయం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్, ఓఎస్డీ టు విసి డాక్టర్ డి. హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మావతి, మహిళా సెల్ డైరెక్టర్ డాక్టర్ వి. నమ్రత, వార్డెన్లు సావిత్రి, జయంతి, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే విజయం ఖాయం



**హుస్నాబాద్, మార్చి 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని గురుకులంలో పదవ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షల దృష్ట్యా మోటివేషన్ తరగతి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీఆర్జీపీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వంతడుపుల శ్యామ్ సుందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని, ఈ పరీక్షలు కేవలం మార్కుల కోసం మాత్రమే కాకుండా భవిష్యత్తు చదువులు, జీవిత లక్ష్యాలకు పునాది అవుతాయని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే తప్పకుండా మంచి ఫలితాలు సాధిస్తారని, మీ విజయమే తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు గౌరవాన్ని తెస్తుందని పేర్కొన్నారు.పట్టుదలతో చదివితే విజయం వరిస్తుంది అని విద్యార్థులకు ధైర్యం నింపుతూ, ఈ పరీక్షలను భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని రేపటి దేశ భవిష్యత్తుకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గడ్డం వెంకట్రామిరెడ్డి, అధ్యాపకులు సంతోష్, తిరుపతి రెడ్డి, సుజాత, ఉపాధ్యాయుల బృందం, తల్లిదండ్రుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు







**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరంలో ప్రజా రహదారులపై జరుగుతున్న ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ కార్పొరేటర్, న్యాయవాది ఎ.వి. రమణ తెలిపారు.ప్రజలకు ప్రణాళికాబద్ధమైన నగరాభివృద్ధి అందించాల్సిన బాధ్యత గల ప్రజాప్రతినిధులపై రోడ్డు ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు రావడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ స్వయంగా చొరవ తీసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ కుటుంబ సభ్యులపై రాంచంద్రాపూర్ కాలనీలో 20 ఫీట్ల రోడ్డుకు సంబంధించిన ఆక్రమణ ఆరోపణలు ఉన్నాయని, ఈ విషయమై ఇప్పటికే నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. అదేవిధంగా, మాజీ మేయర్ మరియు ప్రస్తుత డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు పూర్వ కార్యాలయం భగత్ నగర్‌లో 30 ఫీట్ల రోడ్డుపై నిర్మాణం జరిగిందనే అంశంపై కూడా విచారణ అవసరమని రమణ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఆ భవనానికి ఇంటి నెంబర్ 9-1-211/ఏ/2 కేటాయించబడిందని, గతంలో అది కార్పొరేటర్ కార్యాలయంగా వినియోగించబడిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.ప్రజా రహదారులు ప్రజలందరికీ సాధారణ హక్కు అని, ఎవరైనా ఆక్రమించినట్లయితే చట్టపరంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలిపారు.నిజానిజాలు వెలుగులోకి రావడానికి పారదర్శక విచారణ జరిపి ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఎ.వి. రమణ కోరారు.

# భారీ సంఖ్యలో టీఎన్జీవో సభ్యత్వ నమోదు



**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ఎన్జీవో సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా మెడికల్ అండ్ హెల్త్, పశుసంవర్ధక, ట్రెజరీ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. మెడికల్ అండ్ హెల్త్ శాఖ కార్యక్రమాన్ని ఉద్యోగి నాయకులు గోవిందపతి శ్రీనివాస్, జీవన్ రెడ్డి, పాండు, ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, పశుసంవర్ధక శాఖ కార్యక్రమాన్ని గిరిధర్ రావు, కమలాకర్, అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రెజరీ శాఖ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, కొండయ్య, శశి, మహేందర్, రాధా లక్ష్మి పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలకు ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, సభ్యత్వం అంటే కేవలం డబ్బులు కాదు, అది సంఘానికి పునాది రాళ్ల సమీకరణ అని, ఉద్యోగుల హక్కుల సాధనలో ఎన్జీవో సంఘం ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని తెలిపారు.హెల్త్ శాఖ ఉద్యోగులు ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నారని, ఎమర్జెన్సీ సమయంలో సైనికుల్లా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తారని ఆయన ప్రశంసించారు. అలాగే పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు మూగజీవాలకు సేవ చేస్తూ సమాజానికి కీలక సేవలు అందిస్తున్నారని కొనియాడారు.ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ నల్ల లింగారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీఎన్జీవో జిల్లా నాయకులు సంగ్యం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్ కుమార్, సర్దార్ అరవింద్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వరరావు, అలాగే ఉద్యోగులు రాజేష్, హైమావతి, హరిప్రియ, జగన్ గౌడ్, విజయలక్ష్మి, తోటరాజు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంపై ఆకస్మిక తనిఖీ

**కలెక్టర్ కె. హైమావతి**






**సిద్దిపేట, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు అత్యంత లాభదాయకమని, రైతులు పెద్దఎత్తున ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు.దుబ్బాక మండలం దుంపలపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా రైతు చింత రాజు వ్యవసాయ క్షేత్రంలో 12 ఎకరాల విస్తీర్ణంలో కలెక్టర్ ఆయిల్ ఫామ్ మొక్కను నాటారు. ఇప్పటివరకు జిల్లాలో 14,200 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ, వరి సాగు మాత్రమే కాకుండా పంట మార్పిడి ద్వారా కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ ఫామ్ వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల వరకు సహాయం అందిస్తుందని, మూడు సంవత్సరాల తర్వాత ఆయిల్ ఫామ్ ద్వారా రైతులు నెలకు ప్రభుత్వ ఉద్యోగుల వేతనానికి సమానమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. అంతర పంటలుగా అరటి, కోకో వంటి పంటలు వేసుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, తహసీల్దార్ సంజీవ్, రైతులు పాల్గొన్నారు.దుబ్బాక మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, ఆలుగడ్డ టమాటా, టమాటా చారు వంటకాలను పరిశీలించి, రుచికరంగా, విద్యార్థుల సంఖ్యకు సరిపడేలా వండాలని వంట సిబ్బందికి ఆదేశించారు.విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించి, పద్యాలు, కథలు చదివించి అభినందించారు. పాఠశాల గ్రంథాలయంలోని కథలు చదవాలని, పద్యాలను గట్టిగా పలుమార్లు చదివితే కంఠస్థం అవుతుందని సూచించారు. తరువాత అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు పోషకాహారం అందించాలని, ఆకుకూరలు, మునగాకు, గుడ్లు వంటివి తప్పనిసరిగా ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

## బ్రహ్మోత్సవాల్లో బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఉప్పునుంతల, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ఇలాంటి సంప్రదాయ క్రీడలు గ్రామీణ సంస్కృతిని కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 17వ రోజుకు చేరిన ఏషియన్ పెయింట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ల సమ్మె

**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : ఏషియన్ పెయింట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు గోదాము ముందు ధర్నా కొనసాగిస్తున్నారు. లేబర్ కమిషనర్ కార్యాలయంలో రెండోసారి చర్చలు విఫలమవడంతో సమ్మె ఈరోజు 17వ రోజుకు చేరింది. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, యాజమాన్యం పోలీసులతో బెదిరింపులు, కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నా డ్రైవర్లు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు. వెంకట్ లాజిస్టిక్, దుబ్బ నాగభూషణం ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీల వద్ద 60 మంది డ్రైవర్లు తమ సొంత వాహనాలతో సరఫరా పనులు, హమాలి లోడింగ్--అన్‌లోడింగ్ పనులు చేస్తున్నారని, కానీ



యజమానులు ప్రతి వాహనంపై రూ.2800 కమిషన్ రూపంలో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. 60 వాహనాలకు అగ్రిమెంట్ వెంటనే చేయాలని, డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ఏషియన్ పెయింట్ గోదాము మేనేజర్ వీరేందర్ రెడ్డి హమాలి చార్జీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, కంపెనీ ఇతర డ్రైవర్లకు అందిస్తున్న సౌకర్యాలను వీరికి ఇవ్వకపోవడం తీరని అన్యాయమని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు, పోరాటాలు పెద్ద ఎత్తున కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కామల్ల మహిపాల్, కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి వెంకటేశ్, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, మహేష్, తిరుపతి, శ్రీకాంత్, హరీష్, పరమేశ్వర్, శేఖర్, ప్రసాద్, మధు, సాగర్, సంతోష్, కుమార్, అనిల్, రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల మ్యూల్ అకౌంట్లపై ఉక్కుపాదం

**కరీంనగర్,మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం చేపట్టిన ఆపరేషన్ క్రాక్‌డౌన్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ అకౌంట్ దారులపై పోలీసులు కఠిన చర్యలు ప్రారంభించారు. కరీంనగర్‌లోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో 34 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఇప్పటివరకు ఎన్సీఆర్పీ మీటింగ్ పోర్టల్ ద్వారా 162 ఫిర్యాదులు అందగా, ఈ ఖాతాల ద్వారా వెయ్యికి పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో తేలింది. 20 కేసులు ఇప్పటికే నమోదు కాగా, నిందితులపై కొత్త చట్టం సెక్షన్ 112 బీఎన్ఎస్ ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, కొందరు వ్యక్తులు స్వల్ప కమీషన్ల ఆశతో తమ బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి లింక్ అయిన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని




తెలిపారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుండి దోచుకున్న సొమ్మును ఈ మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించి వాడుకుంటున్నారని వివరించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా వివరాలు చెప్పడం నేరమని, అలా చేసిన వారిని సైబర్ నేరగాళ్లకు సహకరించిన నేరస్థులుగానే పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు సూచిస్తూ, అపరిచితులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, ఓటిపి వివరాలు ఇవ్వకూడదని, నెలవారీ కమీషన్ల పేరుతో ఖాతా వినియోగించుకోవాలని వచ్చే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బ్యాంకు అధికారుల సమన్వయంతో మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి మిగిలిన నేరస్థులను కూడా త్వరలో పట్టుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

# మొక్కు తీర్చుకునేందుకు తిరుమల నడక యాత్ర చేపట్టిన కవిత

**- కప్పాటి పాండురంగారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా , మహేశ్వరం మార్చి 05 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన మొక్కు తీర్చుకునేందుకు తిరుమల నడక యాత్రను చేపట్టారు. సత్యమే జయించింది అక్రమ కేసుల నుండి విముక్తి పొంది.. మొక్కు తీర్చుకునేందుకు తిరుమల నడక యాత్ర చేపట్టారు అని కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ర్షచిస్ అవెన్యూ కోర్టులో కుట్రపూరిత కేసుల కొట్టివేత – న్యాయం గెలిచిన వేళ శ్రీవారి చెంతకు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత . నూతన రాజకీయ ప్రస్థానానికి సిద్ధమవుతున్న వేళ అలిపిరిలో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో కాలినడకన తిరుమల పయనం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పై కేంద్ర దర్యాప్తు సంస్థలు కుట్రపూరితంగా మోపిన అక్రమ కేసులను ఢిల్లీలోని ర్షచిస్ అవెన్యూ న్యాయస్థానం కొట్టివేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని పాండురంగారెడ్డి అన్నారు. ఎటువంటి ఆధారాలు లేని, నిరాధారమైన ఆరోపణలతో పెట్టిన కేసులను న్యాయస్థానం క్లీన్ చిట్ ఇస్తూ తీర్పునివ్వడం సత్యానికి లభించిన విజయమని కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ చారిత్రాత్మక విజయానంతరం, తన మొక్కును తీర్చుకునేందుకు కవిత నేడు తిరుపతి అలిపిరి నుంచి తిరుమల గిరులకు కాలినడక యాత్రను ప్రారంభించారు అని వారు అన్నారు. అలిపిరి వద్ద నేతల ఘన స్వాగతం .న్యాయపోరాటంలో విజయం సాధించి, నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో అలిపిరి మెట్ల



మార్గం వద్ద కవిత కి తెలంగాణ జాగృతి నేతలు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్, మేడ్చల్, మల్కాజ్‌గిరి అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు డి.వీరన్న స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో: తెలంగాణ జాగృతి నాయకులు చలసాని విష్ణుమూర్తి, కుమ్మరి శివశంకర్, ప్రకాశ్,ఉండెల బాబు రావు, శ్రీశైలం తదితర రంగారెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నూతన రాజకీయ దిశగా అడుగులు ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. “కవిత పై జరిగినది ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని నేడు న్యాయస్థానం తీర్పుతో తేలిపోయింది. అగ్నిపరీక్షలో నెగ్గిన మేలిమి బంగారంలా కవిత బయటకు వచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సేవే లక్ష్యంగా ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఈ మొక్కుబడి యాత్ర చేపట్టినట్లు” తెలిపారు. శుక్రవారం శ్రీవారి దర్శనం భారీ అనుచర గణంతో అలిపిరి మెట్ల మార్గం ద్వారా నడక సాగించిన కవిత నేడు తిరుమల చేరుకున్నారు. రేపు (6వ తేదీన) ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని. న్యాయ విజయం మరియు రాజకీయ భవిష్యత్తుపై భగవంతుని ఆశీస్సుల కోసం ఈ యాత్ర ప్రాధాన్యత సంతరించుకుందని పాండురంగారెడ్డి అన్నారు.

# లయన్ డిస్ట్రిక్ట్ 320జి మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం




**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ బెజ్జంకి సౌజన్యంతో మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. లయన్ నా రెడ్డి సుదర్శన్ రెడ్డి -- లయన్ లేడీ పద్మ పెళ్లి రోజు సందర్భంగా, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 200 మందికి పైగా అవసరార్థులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ జిల్లా కార్యదర్శి (మానేరు) కృష్ణ, లయన్ పాత కిరణ్ కుమార్, లయన్ రంగురాజు (గోల్డెన్ టవర్ అధ్యక్షులు) పాల్గొన్నారు. మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ హంగర్ రిలీఫ్ ఇన్‌చార్జి లయన్ రావికంటి కృష్ణ కిషోర్ ఈ విషయాన్ని తెలియజేశారు.

# కలెక్టర్ మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్, డిప్యూటీ మేయర్



**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరపాలక సంస్థ నూతన మేయర్ కొలగాని శ్రీనివాస్, మాజీ మేయర్ మరియు ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఈరోజు జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ చిత్ర మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

**-కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మార్చి 5 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఐదు దశల్లో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖలు సంసిద్ధం కావాలని సూచించారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయిలో గ్రామసభలు, ఏప్రిల్ 16న మండలస్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సభల్లో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, లబ్ధి వివరించాలని సూచించారు. ప్రణాళిక శాఖ నోడల్‌గా వ్యవహరిస్తుందని, పరిశుభ్రత, పెండింగ్ ఫైల్ క్లియరెన్స్, ఆరోగ్యం, సంక్షేమం, పిల్లల భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం, విద్య, యువత--క్రీడలు, మహిళలు--పర్యావరణం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.